క్యాంపస్ ఇంటర్వ్యూలలో 104 మంది ఎంపిక

విశాలాంధ్ర - పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల నందు డేటా ప్రో ఆధ్వర్యంలో వివిధ కంపెనీలు, సంస్థలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 104 మంది ఎంపిక య్యారు. ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలకు కళాశాల నుండి ఫైనల్ ఇయర్ బి.ఎస్.సి, బీకాం, బిబిఏ చదువుతున్న, పూర్తయిన విద్యార్థులు సుమారు 200 మంది పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులను విద్యా సంస్థల అధినేతలు సి.హెచ్.వి.కే. నరసింహారావు, సిహెచ్ విజయ ప్రకాష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డేటా ప్రో సంస్థ హెచ్.ఆర్. తేజ, డిఫైన్ కంపెనీ హెచ్.ఆర్. డేవిడ్ సురేందర్, ఎస్.సుధీర్, డి.వేదవ్యాస్ పాల్గొన్నారు.

ఎన్డీఏకి ఓటు దేశ వినాశనానికే...

ఇండియా కూటమితోనే దేశం సురక్షితం
ఏఐసీసీ పరిశీలకులు మనోజ్ చౌహాన్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జరగబోయే ఎన్నికల్లో ఎన్డీఏకి ఓటేస్తే దేశం వినాశనమవుతుందని అఖిలభారత కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు మనోజ్ చౌహాన్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన పదేళ్లుగా మోడీ దేశాన్ని విచ్ఛిన్నం చేశారని ఆరోపించారు. ఈ దేశానికి ఇండియా కూటమి విజయం ఎంతైనా అవసరమని అన్నారు. ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్, ఎమ్మెల్యే అభ్యర్థి ఐ.ఆర్.గంగాధర్ మాట్లాడుతూ దేశం ప్రమాదంలో ఉందని మళ్లీ మోడీ వస్తే భారతదేశ రాజ్యాంగాన్ని సైతం మార్చేస్తారని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన, వైసీపీకి ఓటేసిన అది బీజేపీకి వేసినట్లేనని అన్నారు. సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ అటు దేశంలో మోడీ ఇటు రాష్ట్రంలో జగన్ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారని మండిపడ్డారు. దేశ రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నా, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలన్న ఇండియా కూటమి అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. బీజేపీ అంటేనే బాబు, జగన్, పవన్ అని అన్నారని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు బిజెపి పూనుకుంటే వైసీపీ, టీడీపీ, జనసేన ఎందుకు ప్రశ్నించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోగా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ సైతం ఇవ్వకుండా బిజెపి మోసం చేసిందని ఆరోపించారు. ఈ పదేళ్లుగా దేశంలో బిజెపి రాష్ట్రంలో టిడిపి, వైసిపి పూర్తిగా వైఫల్యం చెందాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించడం శుభ పరిణామం అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాదం, సీపీఐ ఎం.ఎల్ (లిబరేషన్ పార్టీ) రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్.అజయ్ కుమార్ మాట్లాడుతూ దేశం ప్రమాదంలో ఉందని మోడీ గ్యారెంటీ అంటే ఆదానికి, అంబానికి మాత్రమేనని అన్నారు. దేశానికి గ్యారెంటీ ఇచ్చేది ఇండియా కూటమి మాత్రమేనని అన్నారు. బ్యాంకులను మోసం చేసి, ఫోర్జరీ సంతకాలతో కోట్ల రూపాయలను కొల్లగొట్టిన సీఎం రమేష్‌కు రాబోయే రోజుల్లో ఇక్కడి ప్రజలు గుణపాఠం చెప్తారన్నారు. సీఎం రమేష్‌కు సహకరిస్తున్న కొణతాల రామకృష్ణ వ్యక్తులు కూడా ఆలోచించుకోవాలని సూచించారు. జీఎస్టీ అధికారులు బెదిరించి, వారిపై రౌడీయిజానికి దిగిన సీఎం రమేష్ వైఖరేంటో ప్రజలు గమనించాలని పిలుపునిచ్చారు. సీఎం రమేష్‌ను ఆంధ్ర మాల్యాగా పోల్చిన బిజెపి నాయకుడు జీవీఎల్ నరసింహారావు రాజ్యసభ స్పీకర్ కూడా ఫిర్యాదు చేసినట్లు గుర్తు చేశారు. సీఎం రమేష్ బీజేపీలోకి వెళ్లిన వెంటనే ఆ కేసులు ఏమైపోయాయి అని ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో ఒక్క శాతం ఓటు బ్యాంకు లేని బీజేపీతో టీడీపీ, జనసేన ఎందుకు పొత్తు పెట్టుకున్నాయని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నర్సీపట్నం అసెంబ్లీ అభ్యర్థి శ్రీరామ్ మూర్తి, పాయకరావుపేట అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ బోని తాతారావు, తిలక్, జగన్, సీపీఐ నాయకులు రాజాన దొరబాబు, వైఎన్ భద్రం, తాకాసి వెంకటేశ్వరరావు, కోరుబిల్లి శంకర్రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి సంతోష్, భాస్కర్‌రావు, పూజారి నర్సయ్య, భూపతి కృష్ణ, కొల్లి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అనుకూల పార్టీలకు బుద్ధి చెప్పాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: త్యాగాల ద్వారా సాధించుకున్న స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు అనుకూల పార్టీలకు మే 13న జరిగే ఎన్నికలలో బుద్ధి చెప్పాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. సోమవారం వై.విజయకుమార్ హాల్‌లో ఇండియా కూటమిను గెలిపిద్దాం - స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకుందాం అనే అంశంపై వక్తలు వి.పెంటకోట సత్యనారాయణ (ఎఐటియుసి), రుత్తల శంకరరావు (సీఐటీయూ), సిహెచ్ రాంబాబు (ఏఐఎఫ్‌టీయు), బాలు గాడి (రైతు స్వరాజ వేదిక), బూసి పరమేశ్వరీ (మహిళా సమాఖ్య), సాయి లక్ష్మణ్ (బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్) మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు కుట్ర చేసిన మోడీ ప్రభుత్వానికి తగ్గిన బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు. రాష్ట్రాన్ని మోసం చేసిన బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తు ఎందుకు పెట్టుకుందని వక్తలు ప్రశ్నించారు. రాజ్యసభలో ఒక్కసారి కూడా స్టీల్‌ప్లాంట్ కోసం మాట్లాడని సీఎం రమేష్ ఇప్పుడు నన్ను ఎంపీగా గెలిపిస్తే అనకాపల్లి మేలు చేస్తానని మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాల ప్రతినిధి వర్గాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మోడీ దగ్గర ఎందుకు తీసుకుని వెళ్లలేదని నిలదీశారు. సీఎం రమేష్ ను ఎంపిగా ఓడించి మోడీకి బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.అప్పలరాజు, కె.త్రినాథ్, కోన లక్ష్మణ్, స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులు మొల్లేటి కొండలరావు, ప్రజా సంఘాల నాయకులు చిన్ని యాదవ్, కోరిబిల్లి శంకరరావు, ప్రసాద్, వీరచారి దేముడుబాబు, బాబ్జీ, కన్నబాబు, వియ్యపు రాజు, నరాలశెట్టి సత్యనారాయణ, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి వలసలు

విశాలాంధ్ర - అచ్యుతాపురం: జనసేన నాయకులు ద్వారపు రెడ్డి బాపు (బాబ్జి) ఆధ్వర్యంలో వైసీపీ నుంచి జనసేనలోకి వలసలు కొనసాగుతున్నాయి. సోమవారం మునగపాక మండలం కాకరాపల్లి గ్రామ వైసీపీకి చెందిన సర్పంచ్ కొల్లి ముసిలయ్య తన అనుచర వర్గంతో కలిసి జనసేన నాయకులు ద్వారపు రెడ్డి బాపు (బాబ్జి), ఆడారి కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో యలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. చేరినవారికి సుందరపు విజయ్ కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరికల అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ కాకరపల్లి గ్రామంలో మిగిలిన వారిని తొందర్లోనే జనసేన పార్టీ గూటికి తీసుకు వస్తానన్నారు. సుందరపు విజయ్ కుమార్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల బస్టాండ్ వద్ద సోమవారం అగ్నిమాపక వారోత్సవాలు పురస్కరించుకొని అగ్ని ప్రమాదాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అనంతరం డెమో చేసి చూపించారు. మాడుగుల అగ్నిమాపక కేంద్రాధికారి వి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మోదకొండమ్మ తల్లి మొక్కు పండగ

విశాలాంధ్ర - వి.మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ తల్లి మొక్కు పండగ 55ఘటాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పండుగను మోదమాంబ కాలనీకి చెందిన పాచిల కృష్ణారావు, కోటమ్మ దంపతులు ఆధ్వర్యంలో జరిగింది. బాణాసంచా, డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఘటాలను ఊరేగించి అనంతరం అమ్మవారికి సమర్పించారు. పండుగ సందర్భంగా గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

వైసీపీ నాయకులు ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర - పాయకరావుపేట: రానున్న ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడుకు ఓట్లు వేసి గెలిపిం చాలని వైసిపి నాయకులు పాయకరావుపేట పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసిపి హయాంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధనిశెట్టి బాబూరావు, వైసిపి జిల్లా ప్రచార కమిటీ విభాగం అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, జగతా శ్రీను, జడ్పిటిసి లంక సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి సత్య మహేష్, పిరాది రాజు, నెలపర్తి అర్జున్, నెలపర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నవమి రాట మహోత్సవం

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: మండలంలోని తట్టబంధ జంక్షన్లో ఇటీవల నూతనంగా ప్రారంభమైన శ్రీ సీతారాముల ఆలయంలో ఈనెల 17వ తేదీన శ్రీరామనవమిని పురస్కరించుకొని సోమవారం గ్రామంలోని ముత్తైదువులు అందరు కలిసి రాముడి కళ్యాణ రాటను వేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సిబ్బంది మాట్లాడుతూ సీతారాముల కళ్యాణం సందర్భంగా 17వ తేదీన భారీ అన్న సమారాధనతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైసీపీ ఎంపీపీ కిలపర్తి రాజీనామా

విశాలాంధ్ర - దేవరాపల్లి: దేవరాపల్లి మండలం ఎంపీపీ పదవికి కిలపర్తి రాజేశ్వరి సోమవారం రాజీనామా చేశారు. ఆమె రాజీనామా ఉమ్మడి విశాఖ జిల్లా సీఈవో ఎం.పోలినాయుడుకు స్వయంగా అందజేశారు. కిలపర్తి రాజేశ్వరి భర్త వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావుతో వెళ్లి సీఈఓను కలిసి తన రాజీనామాను ఆమోదించాల్సిందిగా కోరారు. ఎంపీపీ పదవికి కిలపర్తి రాజేశ్వరి రాజీనామా చేసినట్లు సీఈవో పోలినాయుడు ధ్రువీకరించారు.

కాంగ్రెస్ అభ్యర్థిని మార్చి స్థానికులకే టికెట్ ఇవ్వాలి



విశాలాంధ్ర - పాయకరావుపేట: 2024 అసెంబ్లీ ఎన్నికలకు పాయకరావుపేట కాంగ్రెస్ అభ్యర్థిగా బోని తాతారావుని ప్రకటించడం అధిష్టానం తొందరపాటు నిర్ణయంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ టికెట్ ఆశావాహులు పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అధిష్టానం టికెట్ విషయంలో పునరాలోచన చేయాలని భంగ పడిన కాంగ్రెస్ స్థానిక అభ్యర్థులు గారా సూర్యారావు, భూర్తి యేసయ్య, మోర్త సింహాచలం, మారుతి నారాయణ చక్రవర్తి కోరారు. సామాన్య కార్యకర్తగా అనేక సందర్భాల్లో కాంగ్రెస్ విధి విధానాలను స్థానిక నాయకులుగా మా భుజ స్కందాలపై వేసుకొని పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లామని, అనేక కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో జన సమీకరణ చేసి అనేక సుదూర ప్రాంతాలకు, ప్రజలను పార్టీ సమావేశాలకు, పాదయాత్రలకు తరలించామని తెలిపారు. ఆర్థికంగా ఖర్చు చేసిన తమలో ఒకరికి అధిష్టానం టికెట్ ఇస్తే అందరం కలిసి పని చేస్తామని తెలిపారు. స్థానికేతరులు, పార్టీలో సభ్యత్వం లేని, జీరో పనితనం ఉన్న తాతారావుకు టికెట్ ఇచ్చి పని చేయమనడం స్థానిక నాయకుల్లో కలవరంగా ఉందన్నారు. బోని తాతారావును మార్చాలని, స్థానికులైన తమలో ఒకరికి టికెట్ ఇవ్వాలని డీసీసీ, పిసిసి, ఎఐసిసి పెద్దలకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

చౌడువాడలో మెగా కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండలంలోని చౌడువాడ గ్రామంలో రామాలయం వద్ద సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ అనకాపల్లి వారి సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 72 మంది కంటి రోగులు పరీక్షలు చేయించుకోగా అందులో 30 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ దుర్గా భవాని మాట్లాడుతూ కంటి నరాలు తదితరాల చికిత్సలకు తమ ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కోఆర్డినేటర్ సిహెచ్. అశ్వని కుమార్, నర్సింగ్ స్టాఫ్ గంగమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడులను ఆదరించండి

విశాలాంధ్ర - పాయకరావుపేట: పాయకరావుపేట నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కంబాల జోగులును, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడును ఆదరించాలని వైసిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, పాయకరావుపేట ఎన్నికల పరిశీలకులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలోని యస్. రాయవరం మండలం, ధర్మవరం అగ్రహారంలో ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వరుదు కళ్యాణి మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి వైసిపి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొలిశెట్టి గోవిందరావు, బొలిశెట్టి శారద తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ అమర్‌ను గెలిపించి పెద్ద తప్పు చేశా

వైసీపీ పాలనలో అనకాపల్లిలో అంతులేని అవినీతి
కూటమి నాయకులు కొణతాల, దాడి, సీఎం రమేష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: గడిచిన ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలే ఎజెండాగా పాలన సాగించారని అభివృద్ధి ఎక్కడా కానరాలేదని మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ, పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేష్ ఆరోపించారు. స్థానిక గవరపాలెం వీ.వీ.రమణ రైతు భారతి కళ్యాణ మండపంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అభిమానుల ఆత్మీయ సమావేశం దాడి రత్నాకర్ అధ్యక్షతన నిర్వహించగా ముందుగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి అసెంబ్లీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ 40 ఏళ్ల తరువాత దాడి కుటుంబంతో కలిసి పని చేయడం ఎంతో ఆనందంగా ఉందని చాలామంది అనేక సందర్భాల్లో మీరిద్దరూ కలిస్తే బాగుంటుందని ప్రత్యక్షంగా, పరోక్షంగా చెప్తూ ఉండేవారు కానీ ఆ సమయం ఈరోజు పవన్ కళ్యాణ్ వల్ల రానే వచ్చిందని అన్నారు. మన రాష్ట్రం మన జిల్లా మన నియోజకవర్గ అభివృద్ధికి సర్వతో ముఖాభివృద్ధికి దోహదపడుతుందని పూర్తిగా విశ్వసిస్తున్నానని మాస్టర్ దగ్గర పరిణతి చెందినటువంటి నాయకత్వం ఉన్నదని ఆయన మాటల్లో ఇంకా యువరక్తం ప్రవహిస్తుందని దాడిని ప్రశంసలతో ముంచెత్తారు. తనకు పోటీచేసే ఉద్దేశం లేదని రాజకీయాల నుంచి విరమించుకుందాం అనుకున్న సమయంలో పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, ఆశయాలు నా భావాలకు దగ్గరగా ఉన్నందున జనసేన పార్టీలో చేరడం జరిగిందని, పొత్తులో భాగంగా పోటీ చేయాల్సి వచ్చిందన్నారు. సీఎం రమేష్‌ని గెలిపిస్తే పార్లమెంట్‌లో తన గళాన్ని గట్టిగా వినిపించి అనకాపల్లికి అవసరమైన నిధులు రప్పించి అభివృద్ధి చేస్తారన్నారు. ఈ ఐదేళ్లలో జగన్ తన కేసుల మాఫీ కోసమే ప్రయత్నించారు తప్ప ఎటువంటి అభివృద్ధి లేదన్నారు. దాడి వీరభద్రరావు మాట్లాడుతూ గతంలో అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా గుడివాడ అమర్నాథ్‌ను గెలిపించి చాలా పెద్ద తప్పు చేశామన్నారు. మరలా భవిష్యత్తులో అటువంటి తప్పు జరగకుండా చూసుకోవాలన్నారు. అమర్నాథ్ హయాంలో అనకాపల్లి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంత రీతిలో అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. ఈయన హయాంలో సుమారు 500 కోట్ల రూపాయల అవినీతి చేసి అవినీతి చక్రవర్తిగా పేరు సంపాదించారన్నారని ఎద్దేవా చేశారు. ఇటువంటి ప్రబుద్ధుడిని జగన్మోహనరెడ్డి మనకు బహుమతిగా అందించడం దౌర్భాగ్యం అన్నారు. ఈ ఐదేళ్లలో అమర్ చేసిందేమిటంటే.. అనకాపల్లి మండలంలో ఇద్దరిని, కశింకోట మండలంలో ఇద్దరిని, పట్టణంలో ఇద్దరినీ ఇలా బ్రోకర్లను నియమించుకొని వారి ద్వారా ఏ విధంగా అవినీతి చేయాలి అన్న విషయంలో అభివృద్ధి చెందారని అనకాపల్లి నియోజకవర్గాన్ని ఏ విధంగా భ్రష్టు పట్టించాలో ఆ విధంగా నీచాతినీచంగా తయారు చేసిన ఘనత అమర్‌కే దక్కుతుంద న్నారు. అలాగే ఇప్పుడు ఊరు పేరు అడ్రస్ లేని ఎక్కడో విదేశాల్లో ఉండే వ్యక్తి వద్ద నుంచి డబ్బులు తీసుకొని వైసీపీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిందని అటువంటి వ్యక్తిని గెలిపిస్తే మరలా ఈ అమర్నాథ్ అండ్ కంపెనీ పాలనే చూడాల్సి వస్తుందని దీనిని దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే కొణతాల రామకృష్ణ మంచి కుటుంబ నేపథ్యం కలిగిన వ్యక్తి అని కొణతాల సుబ్రహ్మణ్యంతో సుదీర్ఘ కాలంపాటు తనకు ఎంతో సాన్నిహిత్యం ఉండేదని గుర్తు చేశారు. రాజకీయం పరంగా కొణతాల తాను ఆయా పార్టీ సిద్ధాంతాల మేరకు పనిచేసే వారమని వ్యక్తిగతంగా మా మధ్య ఎటువంటి బేదాభిప్రాయాలు లేవన్నారు. అయితే నేడు మేమిద్దరం కలిసి పని చేయడం సంతోషకరమన్నారు. అలాగే ఆ కులం, ఈ కులం అనే సమస్య మాకు ఏనాడూ లేదని కులం ముఖ్యం కాదని పని చేసే వ్యక్తులు ముఖ్యమన్నారు. వెనుకబడిన అనకాపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని. అలాగే ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ లోకల్ వ్యక్తి కాకపోయినా ఎంతో సమర్థత ఉన్న నాయకుడని రెండుసార్లు రాజ్యసభ సభ్యునిగా పని చేశారని అటువంటి వ్యక్తి అనకాపల్లి ఎంపీ అయితే కేంద్ర ప్రభుత్వ సాయంతో అన్నివిధాలా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. అలాగే ఎన్టీఆర్ మార్కెట్ యార్డు ఎంతో మంది పేద రైతులు భూములు ఇస్తే నిర్మించుకున్నదని ఈ యార్డును రైతుల ప్రయోజనాల కోసమే వినియోగించాలి తప్ప మరి ఏ ఇతర వాటికి వినియోగించినా పార్టీలతో సంబంధం లేకుండా పోరాటం చేయక తప్పదన్నారు. అలాగే వారసత్వంగా వచ్చిన భూముల పాస్ పుస్తకాలపైన, భూముల్లో వేసే సర్వే రాళ్లపైన, చివరకు పుట్టిన బిడ్డకు ఇచ్చే జనన ధ్రువపత్రంపై కూడా జగన్ ఫోటో వేసుకోవడం దారుణమన్నారు. భూములు, ఆస్తుల విషయంలో కోర్టులకు కూడా అధికారాలు తీసేసిన ప్రభుత్వం ఈ జగన్ ప్రభుత్వం అన్నారు. ఇటువంటి అన్యాయాలు, అక్రమాలను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రభుత్వ అవినీతి, అక్రమాలు, అన్యాయాలు ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని మూడు పార్టీల ఉమ్మడి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని దాడి వీరభద్రరావు కోరారు. ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో డబ్బుకు ఆశపడి ఈ రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా యువతకు జగన్ అన్యాయం చేశారన్నారు. ఉత్తరాంధ్రలో ఈ జన సందోహం చూస్తుంటే కొణతాల అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. తాను స్థానికున్ని కాదని కొంతమంది వైసీపీ నాయకులు చెబుతున్నారని, పార్లమెంట్కు పూర్తిస్థాయిలో పని చేసే వారు కావాలి తప్ప స్థానికత ముఖ్యం కాదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, దాడి జయవీర్, సీఎం రమేష్ తనయుడు రిత్విక్, మళ్ల రాజా, బొడ్డపాటి చినరాజారావు, తమ్మన సుబ్బారావు, పెద్ద సంఖ్యలో దాడి అభిమానులు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అనకాపల్లి
మంగళవారం 16, ఏప్రిల్, 2024

అభివృద్ధిని చూసి అవకాశం ఇవ్వండి

24వ వార్డు శెట్టిబలిజ ఆత్మీయ సమావేశంలో కె.కె.రాజు

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహకారంతో విశాఖ ఉత్తర నియోజకవర్గం లో తాను చేసిన అభివృద్ధి పనులు చూసి ఒక్కసారి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె కె రాజు అన్నారు. ఈ మేరకు 24వ వార్డు కార్పొరేటర్ సాది పద్మా రెడ్డి ఆధ్వర్యంలో క్రాంతి నగర్, నక్కవానిపాలెంలో శెట్టిబలిజ ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారి సహకారంతో విశాఖ ఉత్తర నియోజకవర్గం లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. తాను చేపట్టిన కార్యక్రమాలు ఇప్పటివరకు ఏ నాయకుడు చేయలేదని అన్నారు. కావున చేసిన అభివృద్ధిని చూసి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి వైసీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, జి.వి రమణిరెడ్డి, సంపంగి శ్రీనివాస్ ,మురళీక్రిష్ణ రెడ్డి, గుడ్ల అశోక్ రెడ్డి, రామిరెడ్డి, మరియు 24 వార్డ్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థి గుంటూరుకు మహిళల మద్దతు

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటూరు వెంకట నరసింహారావుకు మండలంలోని సరిపల్లి గ్రామానికి చెందిన పలువురు మహిళలు మద్దతు పలికారు. సోమవారం ప్రజాసంఘాల మహిళలు, యువకులు ఆయనతో సమావేశమై వచ్చే ఎన్నికల్లో మీ వెంటే నడుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ మన పెందుర్తి మన అభివృద్ధి అనే నినాదం ప్రజల్లో రావాలని తద్వారానే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈనెల 19న ఉదయం 10 గంటల సమయంలో నామినేషన్ వేస్తానని పెద్ద సంఖ్యలో ప్రజలు అభిమానులు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని నరసింహారావు విజ్ఞప్తి చేశారు.

తాటిచెట్లు దగ్ధం: 5వేల నష్టం

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మెయిన్ రోడ్డు వద్ద గల ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ వరకు గల బీడు భూములు నందు తాటి చెట్లు, తుప్పలు సోమవారం అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. ఈ ప్రమాదంలో 5వేల వరకు నష్టం జరిగింది. కేర్లెస్ స్మోకింగ్ ఈ ప్రమాదానికి కారణమని మాడుగుల కేంద్రాధికారి వి.రాజేశ్వరరావు తెలిపారు.

ఐఎస్‌టిడి 54వ వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ విశాఖ చాప్టర్ ఆధ్వర్యంలో ఐఎస్‌టిడి 54వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఆంధ్రవిశ్వవిద్యాలయం టిఎల్ఎన్ సభామందిరంలో ఘనంగా నిర్వహించారు. కారయక్రమంలో ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి పాల్గొన్నారు. సంస్థ ప్రగతిని ప్రభావితం చేసే అంశాలు, నూతన విధానాలు తదితర అంశాలను వివరించారు. సంస్థ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. జాతీయ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎన్.సాంబశివ రావు మాట్లాడుతూ హెచ్ఆర్ నిపుణులకు గొప్ప వేదికగా ఇది నిలుస్తోందన్నారు. విశాఖ ప్రాంతీయ కేంద్రం చైర్మన్ డాక్టర్ ఓ.ఆర్.ఎం రావు నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ కార్యదర్శి డాక్టర్ హేమ యడవల్లి, ప్రత్యేక అతిథి ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్(ఫైనాన్స్) ఎస్.ఆర్.వి.జి.కె గణేష్ నిపుణులను తీర్చిదిద్దడానికి ఇటువంటి సంస్థలు దోహదపడే విధానం వివరించారు. కార్యక్రమంలో ఐఎస్‌టిడి చాప్టర్ సభ్యులు పాల్గొన్నారు.

ఏయూలో వరల్డ్ ఆర్ట్ డే

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ప్రంచ చిత్రకళ దినోత్సవం(వరల్డ్ ఆర్ట్ డే) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైవిధ్యమైన కళారూపాలను పరిచయం చేస్తూ నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ మిల్లెట్స్‌తో తీర్చిదిద్దిన కళారూపాలతో ప్రత్యేక ప్రదర్శన శివాజీపాలెంలోని ఏయూ చిత్రకళా విభాగంలో ఏర్పాటు చేశారు. దీనిని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు ప్రారంభించి, తిలకరించారు. అనంతరం చిత్రకారుడు విజయ్ కుమార్ కృషిని అభినందించారు. ఆరోగ్యాన్ని అందించే మిల్లెట్స్ ప్రాధాన్యతను దేశవ్యాప్తంగా చాటుతూ గత ఏడాది కాలంగా చేస్తున్న విశేష కృషిని ప్రశంసించారు. కళకు కాదేదీ అనర్హం అన్న చందంగా మిల్లెట్స్‌ని మాధ్యమంగా వినియోగించి, ఎటువంటి రంగులు ఉపయోగించుకుండా కళాఖండాలను తీర్చిదిద్దిన విధానం విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. వరల్డ్ ఆర్ట్ డేని వైవిధ్యంగా విద్యార్థులకు నూతన జ్ఞానాన్ని అందించే విధంగా నిర్వహించిన విభాగాధిపతి సింహాచలంని అభినందించారు. అనంతరం విభాగం తరఫున మిల్లెట్ ఆర్టిస్ట్ విజయ్ కుమార్‌ను సత్కరించారు. మిల్లెట్స్ ఆర్టిస్ట్ మోకా విజయ్ కుమార్ మాట్లాడుతూ 2023 సంవత్సరాన్ని యుఎన్ ఇంటర్‌నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్‌గా ప్రకటించిందని, దీనిని స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మిల్లెట్స్ ఆవశ్యకత తెలియజేయడానికి వందలాది చిత్రాలను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఏపి, తెలంగాణ, న్యూఢిల్లీలలో జరిగిన జి 20 సదస్సుల్లో సైతం తన చిత్రాలను ప్రదర్శించడం జరిగిందన్నారు. విద్యార్థులకు, నగరవాసులకు దీనిపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసామన్నారు. కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను చెల్లించి

5 శాతం రాయితీని పొందండి

- జీవిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: 2024-25 ఆర్థిక సంవత్సరమునకై జీవిఎంసికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను ఏప్రిల్ 30వ తేదీలోగా ఏక మొత్తంగా ఒకేసారి చెల్లించి 5 శాతం రాయితీ (ఎర్లీ బర్డ్ ఆఫర్) ను పొందాలని జీవిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ సోమవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. 2024-25 సంవత్సరం యొక్క జీవిఎంసి కి సంబంధించిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులకు సంబంధించి 2024 ఏప్రిల్ 30వ తేదీ లోగా ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను మొత్తం ఒకేసారి చెల్లించి 5 శాతం రాయితీ పొందవచ్చని, ఈ సదవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని కమీషనరు తెలిపారు. సదరు పన్ను చెల్లింపులకు, జీవిఎంసి అన్ని సౌకార్యం కేంద్రాలను, సూచిత బ్యాంకులను, జీవిఎంసి వెబ్ సైట్ ను ప్రజలకు అందుబాటులో వుంచిందన్నారు.

ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు చెల్లింపు ప్రదేశాలు, మార్గాలు:

జీవిఎంసి ప్రధాన కార్యాలయంలో గల సౌకర్యం కేంద్రం లో, అన్ని జోనల్ కార్యాలయాల సౌకర్యం కేంద్రాలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు పన్నులను చెల్లించవచ్చు అన్నారు. ఆదివారం, ప్రభుత్వ సెలవు దినాలలో కూడా జీవిఎంసి సౌకర్యం కేంద్రాలలో పన్నులను చెల్లించవచ్చని, కేవలం ఆన్ లైన్ ద్వారా చెల్లించే పన్నుదారులు జీవిఎంసి వెబ్ సైట్ gvmc.gov.in - property tax - bharat QR code ద్వారా చెల్లించవచ్చని, జీవిఎంసి సౌకర్యం కేంద్రం, ఐడిబిఐ సిరిపురం బ్రాంచ్, ఐసిఐసిఐ బ్యాంకు, ద్వారకా నగర్ బ్రాంచ్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, మధురవాడ బ్రాంచ్, యాక్సిస్ బ్యాంక్ రామనగర్ బ్రాంచీలలోనూ, అన్ని సచివాలయలలోనూ నగదు/డిడి/డెబిట్/క్రెడిట్ కార్డు ద్వారా కూడా ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను చెల్లించవచ్చును అన్నారు. ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను చెల్లింపుదారులు ఈ పై పన్ను చెల్లింపు సౌకర్యాలను వినియోగించుకొని ఒకేసారి ఏకమొత్తముగా పన్నులను చెల్లించి 5 శాతం రాయితీ (ఎర్లీ బర్డ్ ఆఫర్) ను పొందవచ్చునని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విశాఖ నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ తెలిపారు.

గెలిపించండి....నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం ముకుందపురం, వంటర్లపాలెం గ్రామాల్లో సోమవారం సాయంత్రం టీడీపీ ఆధ్వర్యంలో ప్రజా గళం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి పైలా ప్రసాదరావు హాజరై ఇంటింటికి పర్యటించారు. ఈ సందర్భంగా టిడిపి అధికారంలోకి రాగానే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశ్యారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మాడుగుల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతానన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రసాదరావుతో పాటు మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, టిడిపి మండల అధ్యక్షుడు అద్దివల్లి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, క్లస్టర్ ఇంచార్జి పుప్పాల రమేష్, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గట్రెడ్డి శివాజీ, మండల బీజేపీ అధ్యక్షుడు ఉండూరు రాజు, నాయకులు జల్లి సూర్యప్రకాశరావు, అప్పాన రమణ, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కర్రి మాలిబాబు, వైస్ సర్పంచ్ తెప్పల మాలిబాబు, బర్ల శ్రీను, కర్రి వరహాలరాజు, రాంబుడ్డి సన్ని, టిడిపి, జనసేనపార్టీ, బిజెపిల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు జగనన్నతోనే సాధ్యం..

వైసీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన ద్వారానే తూర్పు నియోజకవర్గంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమని, సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ఏకకాలంలో అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా పట్టాభిషేకం చేద్దామని వైసీపీ, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం పెదజాలరిపేట నుండి వార్డ్ వైసీపీ ఇన్‌చార్జి సూరాడ వెంకట లక్ష్మి దాస్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 89రోజుల నుండి నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించి ప్రజలసమస్యలను అడిగి తెలుసుకుంటున్నామని అన్నారు. సంక్షేమసారధి జగనన్నను మరల ఆశీర్వదించే దిశగా ప్రతిఒక్కరు ఆశీర్వదించాలన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన

వైసీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన ద్వారానే తూర్పు నియోజకవర్గంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమని, సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ఏకకాలంలో అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా పట్టాభిషేకం చేద్దామని వైసీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. విశాఖ తూర్పు నియోజకవర్గంలో పాదయాత్రకు ప్రజలనుండి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. నియోజకవర్గంలో 88 రోజుల నుండి నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామన్నారు.

మీకు మంచి చేసిన వారినే ఆశీర్వదించండి...

తూర్పు నియోజకవర్గంలో "మేము సిద్ధం మా బూత్ సిద్ధం" సభ కార్యక్రమం స్థానిక 19వ వార్డ్ పెదజాలరిపేట వద్ద వైసీపీ నాయకులు జీవి రామచంద్ర రావు ఆధ్వర్యంలో జరిగింది. సభలో ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఏపీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి ఈ వార్డులో కోట్ల రూపాయలు నిధులతో అభివృద్ధి పనులు చేసామన్నారు. ముఖ్యంగా రోడ్లు ఈ ప్రాంతంలో ఎంతో అభివృద్ధి చేసాం అన్నారు. మహిళను లక్షాధికారిగా చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. ముఖ్యంగా మత్స్యకార ప్రాంతాల్లో సముద్ర తీర ప్రాంతాల నివసించే ఈ ప్రాంతాలలో డ్రైనేజీలు, మంచినీటి వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రతి ఒక్కరూ పెత్తందార్లతో యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తూర్పు నియోజకవర్గం సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తమ సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన హామీలు 100 శాతం నెరవేర్చారన్నారు. పేద ప్రజలు బాగుండాలని సంక్షేమ పాలనతో ప్రతి పేదవాడికి అర్హులకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 600 పేజీల మేనిఫెస్టోను మరిచి ప్రజలకు అన్యాయం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో యుద్ధంలో ప్రతి ఒక్కరు ఒక సైనికుడిలా పోరాడి జగనన్నని గెలిపించే విధంగా సిద్ధంగా ఉండాలన్నారు. వార్డులో ఇప్పటికి ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వార్డ్‌లో కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు చేశారన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలన్నా, వలంటీర్, సచివాలయ వ్యవస్థలు వుండాలన్నా సీఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం వుందని వివరించారు.

వైసీపీకి మద్దతు ఇవ్వండి: బొత్స

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: వైసీపీకి మద్దతు ఇవ్వాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు గాజువాక నియోజకవర్గం కణితి కళింగ వీధిలో వడ్లపూడి ఆర్‌హెచ్ కాలనీ ఏరియా సంక్షేమ సంఘాలు, గాజువాక ప్రాంత కళింగ సంక్షేమ సంఘాలు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ నాయకులు విశాఖ ఎంపీ అభ్యర్థి డా. బొత్స ఝాన్సీ లక్ష్మి, రాష్ట్ర మంత్రి, గాజువాక నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గుడివాడ అమర్నాథ్ పోటీచేస్తున్నందుకు వివిధ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గాజువాక నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్నాథ్, ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి వి.ఎం.ఆర్.డి.ఎ చైర్మన్ సనపల చంద్రమౌళి ,మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య ,గాజువాక నియోజకవర్గం పరిశీలకులు తిప్పల దేవన్ రెడ్డి , అంబేద్కర్ యూనివర్సిటీ నెంబర్ పేడాడ రమణకుమారి,ఖారవేల ఎడ్యుకేషనల్,కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పేడాడ.నరసింగరావు ప్రెసిడెంట్ మొదలవలస వెంకట రమణ ,ప్రధాన కార్యదర్శి పొందూరు సూర్యనారాయణ ,కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీనివాసరావు ,సనపల భారత్ ,మంత్రి రాజశేఖర్, మొల్లి చిన్న, నీరుకొండ రామచంద్రరావు , జిల్లా కార్యదర్శి ప్రగడ వేణు బాబు ,ముద్దపు దామోదర్ రావు ,గాజువాక మండల అధ్యక్షులు బొడ్డ గోవిందా ,మార్పు శేషు ,అప్పా రావు మాస్టర్ ,ప్రగడ శ్రీనివాస రావు ,ప్రగడ శంకర్ రావు, మూల ధనంజయ్, రామకృష్ణ మాస్టారు , బలగ రామారావు, దుంపల భాస్కర, ఎండ కృష్ణ..రాజారావు,బొడ్డ సన్యాసిరావు ,శ్రీనివాసరావు ,నారాయణ ,పూడి వెంకట్ ,కమిటీ సభ్యులు రామారావు, సంఘం నాయకులు, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

అసమానతలు రూపుమాపిన అస్త్రం అంబేద్కర్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: అసమానతలు రూపుమాపిన అస్త్రం అంబేద్కర్ అంటూ విద్యార్థులు నినదించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో భాగంగా సోమవారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వై.వి.ఎస్ మూర్తి ఆడిటోరియంలో ప్రదర్శించిన లఘునాటికలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అంబేద్కర్ జీవితాన్ని, నాటి పరిస్థితులను వేదికపై విద్యార్థులు ఆవిష్కరించిన విధానం అనిర్వచనీయం. ఎటువంటి నాటక అనుభం లేకుండా, తొలిసారిగా వేదికపై ఏయూ కళాశాలల విద్యార్థుల ప్రదర్శన అందరి మనసులను ఆకట్టుకున్నాయి. ముందుగా ఏయూ ఐఏఎస్ఈ విద్యార్థులు విజన్ ఆఫ్ ఇంక్లూజన్ త్రూ ఎడ్యుకేషన్ నినాదంతో ప్రదర్శించిన రూపకం అంబేద్కర్ జీవితం, వివక్షత, అంటరానితనం, విద్యను ఆయుధంగా మలచుకుని అంబేద్కర్ ఎదిగిన విధానం వంటివి కళ్లకుకట్టినట్లు ప్రదర్శించి అందరి మన్ననలు అందుకున్నారు. ఏయూ ఫార్మశీ కళాశాల విద్యార్థులు మీరైతే ఏం చేస్తారు అంటూ ఆత్మన్యూనతను విడనాడాలని, అంబేద్కర్ రాజ్యాంగం, ఆశయాలను వివరిస్తూ సాగింది. ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు ఇండియా టుడే అంటూ ప్రదర్శించిన లఘు నాటిక హాస్యాన్ని, సందేశాన్ని సమపాళ్లలో అందిస్తూ నడిచింది. విద్యపై అంబేద్కర్ ఆలోచనలను వివరించింది. ఏయూ సైన్స్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన ది విజన్ ఆఫ్ అంబేద్కర్ రూపకం మహిళా సాధికారత, గ్రామాలలో సామాజిక మార్పుల ఆవశ్యకతను తెలియజేసింది. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఐపిఎల్, ఆర్‌బిఐ అండ్ అంబేద్కర్, ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన మహద్ చెరువు కట్ట, న్యాయ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సామాజిక న్యాయముతో సమైఖ్యాభివృద్ధి లఘు నాటికలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆంబేద్కర్ చైర్ ప్రొఫెసర్, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ ఏయూ క్యాంపస్ కళాశాలల విద్యార్థులు తక్కువ సమయంలో నేర్చుకుని ఈ నాటికలు ప్రదర్శించడం జరుగుతోందన్నారు. మనమంతా ఒక్కటే అనే సందేశం చాటుతూ సాగే ఈ ప్రదర్శనను అందరూ ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఓఎస్‌డి ఆచార్య వి.కృష్ణమోహన్, డీన్‌లు, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు శిక్షణ అందించిన నంది అవార్డు గ్రహీత మహేంద్ర చక్రవర్తిని అభినందించి, సత్కరించారు.